క్లుప్తంగా

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణానికి తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. అన్నారుగూడెంలో నూటికి నూరు శాతం సీసీ రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య సహకారంతో మండలంలో సీసీ రోడ్లు వేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోపెల కృష్ణయ్య, గోవింద్ శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, దేవేందర్, పిచ్చయ్య, యేసురత్నం పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కొణిజర్ల: ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ దొడ్డారపు సైదులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా నాయకుడు యర్రా బాబు మాట్లాడుతూ.. మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారులు ఇష్టారీతిన ధరలు తగ్గిస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వరరావు, సైదారావు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల కొరత

కొణిజర్ల: గ్రామ పంచాయతీలకు నిధుల కొరత వేధిస్తుందని పెద్ద మునగాల సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కొణిజర్ల విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 10 నెలల నుంచి నిధుల రాక సర్పంచ్‌లు అప్పులపాలు అవుతున్నారన్నారు. కానీ తెలంగాణ నాయకులు బీఆర్ఎస్ పార్టీ వచ్చిన తర్వాతనే పల్లెలు అభివృద్ధి చెందాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బిల్లులు రాక కనీసం చెత్తబండి కూడా నడిపే పరిస్థితి లేదన్నారు. కనీసం ఇకనైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీలకు రావాల్సిన నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. లేకపోతే భవిష్యత్‌లో ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితి లేదన్నారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో వ్యవసాయ భూమికి సంబంధించిన విషయంలో తలెత్తిన వివాదంలో గ్రామానికి చెందిన మేడ అప్పలస్వామిపై బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కిలారు షర్మిల్ వ్యవసాయ భూమిలో ఉన్నటువంటి 10 ఫెన్సింగ్ రాళ్లను అప్పలస్వామి ధ్వంసం చేసి అక్రమంగా రహదారి నిర్మించాడు. ఇదేమిటని ప్రశ్నించగా అసభ్య పదజాలంతో తిట్టి చంపుతామని బెదిరించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్సై పొదిల వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారని తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

ముదిగొండ: ఐకేపీ ఏపీఎం చిన్నవెంకటేశ్వర్లును దుర్భాషలాడిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబుపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. ముదిగొండలోని స్త్రీశక్తి భవనంలో ఏపీఎంను బుధవారం సీపీఎం నాయకులు కలిసి వివరాలను తెలుసుకున్నారు. రమేష్‌బాబుపై కేసు నమోదు చేయాలని అన్నారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని దుర్భాషలాడడం సరికాదని తెలిపారు.

వేసవి నృత్య శిక్షణా శిబిరం ప్రారంభం



నృత్య శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని పాతసెంటర్ ప్రాథమిక పాఠశాలలో పండు డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో వేసవి నృత్య శిక్షణా శిబిరాన్ని తహసీల్దార్ శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గాదిరెడ్డి సుబ్బారెడ్డి, ప్రసాద్, అహ్మద్, నర్సింహారావు, పవన్, అజయ్, అనూష, నగమణి, జాన్సీ, కొండల్‌రావు, పావని, హసీనా, సుమ పాల్గొన్నారు.

కౌన్ బనేగా 'మార్కెట్' చైర్మన్

- ఆరు నెలలైన భర్తీ కానీ మధిర పాలకమండలి
- వర్గ పోరు భయంతోనే బీఆర్ఎస్ వెనుకంజ ?
- మార్కెట్ కార్యదర్శి పోస్టు కూడా ఖాళీ..



మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మధిర: మధిర మార్కెట్ కమిటీ పాలకమండలి ప్రకటనపై కొనసాగుతున్న జాప్యం పలువురిలో ఉత్కంఠత రేపుతోంది. మధిర నియోజకవర్గంలో ఆరు నెలల క్రితం (2022 అక్టోబర్ 21)తో పాలకమండలి పదవి కాలం పూర్తి అయ్యింది. నూతన పాలకవర్గాన్ని ఎప్పుడు ఏర్పాటు చేస్తారో అని ఆశావాహులతో పాటు రైతులు, వ్యాపార వర్గాలు ఎదురుచూస్తున్నారు. మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం ప్రభుత్వం గతంలో తీసిన రిజర్వేషన్ల ప్రకారం ఈసారి కూడా బీసీ సామాజిక వర్గానికి రిజర్వు చేయబడింది. ఈ రిజర్వేషన్ ప్రకారం ఇప్పటి వరకు మధిర మండలానికి చెందిన చిత్తారు నాగేశ్వరరావు మధిర మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. మార్కెట్ కమిటీ ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు బోనకల్ మండలానికి చైర్మన్ పదవి దక్కలేదు. ఈసారి మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బోనకల్ మండలానికి కేటాయిస్తారని, గతంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ ఆ మండలానికి చెందిన బంధం శ్రీనివాసరావుకి హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే బంధం శ్రీనివాసరావుకి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇస్తే మండలంలో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని ఆ మండలానికి చెందిన మెజార్టీ నాయకులు బంధం నియామకాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో జెడ్పీ చైర్మన్ ఈ పదవిని భర్తీ చేసేందుకు సంశయిస్తున్నట్లు తెలిసింది. బోనకల్లు మండలంలో ప్రస్తుత పరిస్థితుల్లో అధికార పార్టీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నట్లుగా రాజకీయ పార్టీల నాయకులు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలో బీసీల్లో అత్యధిక ఓట్లు కలిగిన గౌడ సామాజిక వర్గానికి ఈసారి మార్కెట్ కమిటీ చైర్మన్ ఇవ్వాలనే ఆలోచనలో కమల్ రాజు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు చైర్మన్ పదవి పొందేందుకు పావులు కదుపుతున్నారు. ఏఎంసీ చైర్మన్ పదవిని బంధం శ్రీనివాసరావుకు ఇస్తున్నారని ప్రచారంలోకి రావడంతో అదే మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కమల్ రాజుని కలిసి తమకు అవకాశం కల్పించాలని కోరారు. మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో సమర్థుడికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాల్సి ఉంది. అయితే చైర్మన్ పదవి ఆశిస్తున్న వారిలో తీవ్ర పోటీ నెలకొన్న దృష్ట్యా పరిస్థితులు చక్కబడేవరకు, రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం పడకుండా అధికారిక ప్రకటన వాయిదా వేయడమే మంచిదని పలువురు ముఖ్య నాయకులు అభిప్రాయపడుతున్నారు.

ఆదాయంలో రెండో స్థానం..

మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీకి గత ఏడాది రూ.4.58 కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా దానిలో రూ.4.29 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోగలిగింది. ఖమ్మం మార్కెట్లో మిర్చి కొనుగోలు జిల్లాలోనే అధికంగా ఉండగా ఆ తర్వాత రెండో స్థానం మధిర మార్కెట్‌కు ఉంది. అదేవిధంగా జిల్లాలో కోల్డ్ స్టోరేజీల నిర్మాణం మధిర రెండో స్థానంలో ఉంది. పత్తి, సుబాబుల్, మొక్కజొన్న, ధాన్యం తదితర పంటల ఉత్పత్తి మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో అధికంగా ఉంటుంది. మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆ పోస్ట్ కూడా ఖాళీగా ఉంది. 15 రోజులు గడిచినప్పటికీ ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా ఎవరికీ అప్పగించలేదు. జిల్లాలోనే ప్రాధాన్యత కలిగిన మార్కెట్ కమిటీ పాలకమండలిని భర్తీ చేసేందుకు అధికార పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ కార్యదర్శి పోస్టును భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోలేకపోతున్నారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. నామినేటెడ్ పోస్టును భర్తీ చేయలేని వారు రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిని ఏ విధంగా గెలిపించుకోగలుగుతారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

పాలకమండలిని నియమించాలి



మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీకి వెంటనే పాలకమండలిని నియమించాలి. మార్కెట్‌లో రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలి. అదేవిధంగా మార్కెట్ కమిటీ కార్యదర్శి పోస్టుతోపాటు ఖాళీ సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి. రైతులకు అందుబాటులో ఉండాలి.

– రంగా అప్పారావు, వ్యాపారి, మధిర

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా



దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న మధిర డిపో మేనేజర్ దేవదానం

వైరా: వైరా లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో బుధవారం వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో దివ్యాంగులకు ఉచిత బస్ పాస్ మేళా నిర్వహించారు. వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్, వైరా లయన్స్‌క్లబ్, మధిర ఆర్టీసీ డిపో వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైరా మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులకు ఉచితంగా బస్ పాస్‌లను మధిర ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ దేవదానం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు అందజేసిన బస్‌పాస్‌లతో లగ్జరీ, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో 50 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, చింతోజు నాగేశ్వరరావు, రాయపూడి వెంకటేష్, డాక్టర్ శ్రీధర్‌గౌడ్, తోటకూర శ్రీకాంత్, వైరా బస్టాండ్ మేనేజర్ ఎ.వెంకటేశ్వర్లు, బస్‌పాస్ క్యాంపు ఇన్‌చార్జ్ మీరా, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన అధికారులు

కారేపల్లి: ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు మండలంలో పలు గ్రామాల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని సింగరేణి మండల వ్యవసాయాధికారి కె.ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పంట పొలాలను బుధవారం పరిశీలించారు. పోలంపల్లి పంచాయతీలోని బుగ్గవాగు ఆయకట్టు కోటిలింగాల వద్ద సుమారు 120 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. 100 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం జరిగినట్లు అంచనా వేశామన్నారు. ఈ సందర్భంగా పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ప్రమీల, పోలంపల్లి సర్పంచ్ సక్రు, రైతులు భద్రు నాయక్, మునిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

తల్లాడ: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించి రూ.600 దినసరి కూలీ ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఖమ్మం జిల్లా నాయకులు షేక్ లాల్ మియా అన్నారు. బుధవారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ఎంపీఓ కె.శ్రీదేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లాల్ మియా మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం ద్వారా పేదల బతుకుల్లో మార్పులు వస్తాయనీ చెప్పిన పాలకులు నిబంధనల పేరుతో పథకాన్ని నీరు గార్చుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, శ్రీను, బాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేయాల్సిందే..

కారేపల్లి: సింగరేణి సంస్థకు ఓపెన్‌కాస్టుల విస్తరణపై ఉన్న ఉత్సాహం ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిపై లేదని సీపీఎం నాయకుడు కొండెబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. మండలంలోని ఓసీ ప్రభావిత గ్రామాలైన ఉసిరికాయలపల్లి, భాగ్యనగర్‌తండాల్లో బుధవారం పర్యటించిన ఆయన ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి విస్మరించి నిధులను దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. నాయకులు కె.నరేంద్ర, వజ్జా రామారావు, భన్సీలాల్, మండల వెంకన్న, తలారి దేవప్రకాష్, ఆర్.మంగయ్య, డి.మల్లయ్య, టి.చందర్, డి.సైదులు, ఆర్.పుల్లయ్య, వై.రత్నం, యు.శ్రీనివాస్, వి.దళసింగ్ పాల్గొన్నారు.


భట్టి చొరవతోనే మధిర అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్

మధిర: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చొరవతోనే మధిర నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని, ఇంకా జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ తెలిపారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల బీఆర్ఎస్ ప్రతినిధుల సభలో భట్టిపై జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ చేసిన ఆరోపణలు సరికాదని పేర్కొన్నారు. మూడుసార్లు ఓడిపోయిన కమల్‌రాజ్‌కు భట్టిని విమర్శించే అర్హత లేదని.. జాలిముడి ప్రాజెక్టులో అవినీతి జరిగిందని చెబుతున్న వారు విచారణ చేయించుకోవాలని సూచించారు. ఇక దళితబంధు లబ్ధిదారుల ఎంపిక కూడా పార్టీకలకతీతంగా జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు దారా బాలరాజు, దుంపా వెంకటేశ్వరరెడ్డి, కర్నాటి రామారావు, బిట్ర ఉద్దండయ్య ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జమలాపురంలో బుధవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలో ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బండారు నర్సింహారావు, బానోత్ శ్రీనివాసరావు, కోటపాటి రంగారావు, దేవరకొండ శ్రీనివాసరావు, గుడేటి బాబురావు, జానీబాషా, పిల్లి బోస్, కోటపాటి పూర్ణ, దేవరకొండ ఏడు కొండలు, తదితరులు ఉన్నారు.

వెంకటేశ్వరరావుకి సన్మానం

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం ఓసీలో మేనేజర్‌గా పని చేసి పదోన్నతిపై వెళ్తున్న మొక్కపాటి వెంకటేశ్వరరావును బుధవారం టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీ గద్దె మురళీకృష్ణ ఆధ్వర్యంలో షీల్డ్‌ను బహూకరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ యాకూబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలాజీ, షిఫ్ట్ ఇన్‌చార్జ్‌లు రాజేశ్వరరావు, నజీర్, డి.రమేష్, మైన్స్ కమిటీ మెంబర్ యు.వెంకటేశ్వర్లు, వెంకటరమణ, రాజశేఖర్, నాగేశ్వరరావు, ఏకాంబర్, రమేష్, అశ్వక్, తోట అశోక్, కుమారస్వామి, కమల్‌పాషా, రెహమాన్, అన్వర్‌పాషా, కనకరాజు, మహేష్, శ్రీను, హమీద్, వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కండీషనల్స్, టీమ్ వర్క్ అంశాలపై ఖమ్మం యూనివర్సిటీ పీజీ కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ వి.గిరిప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ గిరిప్రసాద్‌ను ప్రిన్సిపాల్ పానెం రామచంద్రరావు, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి డి.బంగారి, రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఏన్కూరు: ఈ నెల 27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బయ్యారపు అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి అధికారులు తమ నివేదికలతో హాజరు కావలిసిందిగా కోరారు.

మృతురాలికి బీఎస్పీ నాయకుల నివాళి

కారేపల్లి: మండలంలోని వెంకిట్యాతండా గ్రామానికి చెందిన గుగులోతు బాలి (90) అనారోగ్యంతో మృతిచెందగా.. బుధవారం ఆమె మృతదేహాన్ని బీఎస్పీ నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. మృతురాలి కుమారులు జామ్లా, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మంగ్యా, సోమ్లా, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో వైరా నియోజక వర్గ బీఎస్పీ ఇన్‌చార్జ్ బానోత్ రాంబాబు నాయక్, స్వేరోస్ నెట్‌వర్క్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ స్వేరో, మహిళా అధ్యక్షురాలు బానోత్ రజిని, మాడుగల శరత్, కంకణాల శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

కారాయిగూడెంలో హోమియో వైద్య శిబిరం

పెనుబల్లి: పెనుబల్లి ఏరియా ఆస్పత్రి హోమియో వైద్యులు బుధవారం కొత్తకారాయిగూడెంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. హోమియో వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ హోమియో వైద్యంపై ప్రజలకు ఉన్న అపోహలను వివరించి, దీర్ఘకాలిక వ్యాధులకు ఉబ్బసం, షుగర్, బీపీ, మోకాళ్ళ నొప్పులు, ఎలర్జీ సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో 120 మంది పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్డపనేని శ్రీదేవి, లయన్స్‌క్లబ్ బాధ్యులు చలమాల నరసింహారావు, మేడా రామారావు, యలమంచలి సాంబశివరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



తల్లాడ: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ప్రమీల

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, జిల్లా అదనపు కలెక్టర్ మధుసూధనరావులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైరా ఏడీఏ వి.బాబూరావు, ఏఓ పవన్‌కుమార్, ఎంపీపీ వేల్పుల పావని, జెడ్పీటీసీ సభ్యురాలు నంబూరి కనకదుర్గ, తహసీల్దార్ యస్.అరుణ, ఏఎంసీ సెక్రటరీ నాగేశ్వరి, షేక్ లాల్ మహ్మద్, బాణాల వెంకటేశ్వర్లు, డాక్టర్ కోటయ్య, బానోత్ సక్కుబాయి, రైతు బంధు కమిటీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్వాపురంలో..

తల్లాడ: మండలంలోని బస్వాపురం గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం తల్లాడ జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆదూరి వెంకటేశ్వర్లు, జోన్ చైర్మన్ దిరిశాల దాసురావు, కృష్ణారావు, ఏఈఓ నాగేశ్వరరావు, నరసింహారావు, రామారావు, నాయుడు అప్పారావు, శీలం మురళి, కృష్ణారెడ్డి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

మొక్కజొన్నలు కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

ముదిగొండ: రైతులు పండించిన మొక్కజొన్నలను తక్షణమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ముదిగొండలో బుధవారం మచ్చా వీరయ్య భవనంలో కందుల భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో రాంబాబు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వెంటనే కొనుగోలు చేపట్టాలన్నారు. లేని ఎడల ఆందోళనలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వాసిరెడ్డి ప్రసాద్, మండల కార్యదర్శి కోలేటి ఉపేందర్, నరసింహారావు, మరికంటి వెంకన్న, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మెబాట



తహసీల్దార్ మంగీలాల్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న జేపీఎస్‌లు

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషన్ కాలము గడువు ముగిసినప్పటికీ రెగ్యులరైజేషన్ గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేనందున బుధవారం సమ్మె నోటీసును తహసీల్దార్ మంగీలాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రొబేషనరీ పీరియడ్ ముగిసినప్పటికీ ప్రభుత్వం క్రమబద్ధీకరణపై కాలయాపన చేస్తుందన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో ఆందోళనకు సిద్ధమై సమ్మె నోటీసును ఎంపీడీఓ, ఎంపీఓ, తహసీల్దార్‌కు అందజేసినట్లు తెలిపారు. అలాగే సమ్మెకు మద్దతు తెలపాలని మండలంలోని గ్రామసర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలు పార్టీల అధ్యక్షులను పంచాయతీ కార్యదర్శులు కలిశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు షేక్ సైదులు, చెవుల మహేష్, వినోద్ కుమార్, బాబురావు, రాజేష్, శ్రీరామ్‌కుమార్, రవీందర్, నిఖిల్, మురళీ, విజయరామారావు, రాధాకృష్ణ, ఈశ్వరాచారి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ఎర్రజెండా ఎగరాలి

కొణిజర్ల: మేడే సందర్భంగా మే 1న వాడవాడలా కార్మికులందరు ఎర్ర జెండాలను ఎగరేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం తెలిపారు. కొణిజర్లలో బుధవారం బోయినపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక కర్షక హక్కులను కాలరాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ, బొంతు రాంబాబు, చెరుకుమల్లి కుటుంబరావు, కొప్పుల కృష్ణయ్య, చింతపల్లి ప్రసాద్, కట్టా రాంబాబు, జోనెబోయిన అంజయ్య, హరిచంద్, దానయ్య, రాములు, శ్రీనివాసరావు, కాటయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

పాఠశాలలకు పురస్కారాలు



కారేపల్లి మోడల్ ప్రిన్సిపాల్ ఎండీ అక్తర్‌కు స్వచ్ఛ పురస్కార్ అవార్డు అందిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ



తల్లాడ: మల్లవరం పాఠశాల హెచ్‌ఎం పద్మజకు..



తల్లాడ: అన్నారుగూడెం పాఠశాల హెచ్‌ఎం రమేష్‌కు..

కారేపల్లి/తల్లాడ: కారేపల్లి, తల్లాడ మండల్లాల్లోని కారేపల్లి మోడల్ స్కూల్, అన్నారుగూడెం, మల్లవరం పాఠశాలలు స్వచ్ఛ విద్యాలయాలుగా ఎంపికయ్యాయి. దీంతో బుధవారం ఖమ్మంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ చేతుల మీదుగా కారేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ అక్తర్, అన్నారుగూడెం ప్రధానోపాధ్యాయుడు బి.రమేష్, మల్లవరం ప్రధానోపాధ్యాయురాలు పద్మజ లకు స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, అన్నారుగూడెం, మల్లవరం గ్రామ సర్పంచులు మారెళ్ల మమత, దుగ్గిదేవర సామ్రాజ్యం, ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, ఎంపీటీసీ గోవింద్ విజయమ్మ, పంచాయతీ కార్యదర్శులు వేణు, తిరుపతిరెడ్డి తదితరులు అభినందించారు.

అటెన్షన్ ప్లీజ్

మురుగు తొలగించరూ..



ఏన్కూరు మండల కేంద్రంలో జనవాసాల మధ్య మురికినీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. తిమ్మారావుపేట రోడ్డులో నరేష్ చికెన్ సెంటర్ వెనుక బాగాన మురికినీరు నిల్వ చేరింది. దీంతో ఈ నీటిలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు ఎక్కువై చిన్నారులు జ్వరాల భారీన పడుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

– ఏన్కూరు

ప్రశ్నించాల్సిన అధికారి : పి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, ఏన్కూరు
సెల్ నంబర్ : 9000539657